## క్లుప్తంగా

### వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

చాపాడు : కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో వ్యవసాయ పరికరాల ధరలు తగ్గాయని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత తెలిపారు. జీఎస్టీ తగ్గింపుపై బుధవారం మండల కేంద్ర మైన చాపాడులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయ ట్రాక్టర్ల కొనుగోలుపై గతంలో 15 శాతం జీఎస్టీ ఉండేదని, ప్రస్తుతం ఐదు శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. వ్యవసాయానికి వినియోగించే పరికరాలు అన్నింటిపై జీఎస్టీ తగ్గించారన్నారు. జీఎస్టీ తగ్గింపుపై కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివకుమార్, ఏపీ ఐడీసీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### చెడుపై మంచి విజయం


అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి

పోరుమామిళ్ల : చెడుపై మంచి సాధించిన మహా విజయానికి చిహ్నమే విజయదశమి అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త యస్.విశ్వనాథ రెడ్డి అన్నారు. బద్వేలు నియోజకవర్గ ప్రజలకు బుధవారం ఆయన విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని సమాజంలో శాంతి, ఐక్యత విలసిల్లాలని ఆయన కోరారు.

### తెరచుకోని 33వ రేషన్ షాప్

ప్రొద్దుటూరు : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి నెల చివరి వారంలో వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ చేయాల్సి ఉంది. అయితే స్థానిక శ్రీనివాసనగర్‌లోని 33వ రేషన్ షాప్ ఒకటో తేదీ కూడా తెరచుకోలేదు. రేషన్ షాప్ డీలర్ లక్ష్మి కోర్టును ఆశ్రయించి రేషన్ షాప్‌ను పొందగా, గత డీలర్ మిషన్ కాటాను కోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకున్న డీలర్‌కు అప్పగించలేదు. సరుకు మాత్రం నాలుగు రోజుల క్రితమే గోడౌన్ నుంచి వచ్చినా కాటా మిషన్ లేకపోవడంతో సరుకులు పంపిణీ చేయలేదు. తహసీల్దార్ తమకు మిషన్‌తోపాటు కాటా ఇస్తే వెంటనే సరుకు పంపిణీ చేస్తామని సదరు డీలర్ రేషన్ షాప్ వద్ద బోర్డు పెట్టారు. దీంతో రేషన్ పంపిణీ జరగలేదు. వార్డు కౌన్సిలర్ జిలానీ బాషాతోపాటు స్థానికులు రేషన్ షాప్ ఓపెన్ చేయకపోవడంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు సమాధానం ఇస్తూ బుధవారం రాత్రి మిషన్, కాటాను కోర్టు ఉత్తర్వులు ప్రకారమే డీలర్‌కు అప్పగించామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్ అందిస్తామన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పోరుమామిళ్ల : పట్టణంలోని విజయ ఉన్నత పాఠశాలలో 1992–95 మధ్య విద్య అభ్యసించిన విద్యార్థులు మూడు దశాబ్దాల అనంతరం ఆత్మీయ సమ్మేళనం పేరుతో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాడు ఒకే తరగతి గదిలో చదువుకున్న వారంతా నేడు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఎక్కడెక్కడో ఉన్న వారంతా బుధవారం పోరుమామిళ్లకు కుటుంబీకులతో సహా విచ్చేశారు. తమ జీవితాలను క్లుప్తంగా వివరించడమేగాక, మిత్రులతో నాటి స్నేహం, అల్లర్లు గుర్తుచేసుకుని ఆనందానుభూతులను పంచుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు పెద్దిరెడ్డి, విజయలక్ష్మి, షఫీ, రామయ్య, రామచంద్రారెడ్డి, ఇక్బాల్, రామబ్రహ్మంలను ఘనంగా సన్మానించారు.

## గాయత్రీ.. నమోస్తుతే


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో గాయత్రీదేవి

దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవారు గాయత్రిదేవిగా, ధనలక్ష్మిగా, లక్ష్మివెంకటేశ్వరస్వామిగా దర్శనం ఇచ్చారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా దర్శనం ఇచ్చారు. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మివెంకటేశ్వరస్వామిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. శివాలయంలో, రామేశ్వరం ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో గాయత్రి దేవిగా, మోదంపల్లె పెద్దమ్మతల్లి ఆలయంలో నరసింహాదేవిగా, చెన్నకేశవస్వామి ఆలయంలో ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. రాజరాజేశ్వరిదేవి ఆలయంలో నాట్య గురువు మొహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి, భరతనాట్య నృత్యప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. – ప్రొద్దుటూరు కల్చరల్


బద్వేల్ అర్బన్ : అమ్మవారిశాలలో కాళికాదేవిగా


బద్వేల్ అర్బన్ : కనకదుర్గమ్మ ఆలయంలో ధనలక్ష్మిదేవిగా


కలసపాడులో భవానిదేవిగా అమ్మవారు


పోరుమామిళ్ల : బాలా త్రిపుర సుందరీదేవిగా వాసవీమాత


పోరుమామిళ్ల : లలితా త్రిపుర సుందరీదేవిగా కోట పోలేరమ్మ


కాశినాయన : నరసాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ..


దువ్వూరు అమ్మవారిశాలలో శ్రీగజలక్ష్మీ దేవి


ప్రొద్దుటూరు రాజరాజేశ్వరిదేవి ఆలయంలో నటరాజ కళాక్షేత్రం విద్యార్థుల నృత్య ప్రదర్శన

### సచివాలయ ఉద్యోగులతో వెట్టి చాకిరి తగదు

ప్రొద్దుటూరు రూరల్ : సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించడం తగదని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సచివాలయాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.







### అమ్మవారికి పూజలు


విశ్వనాథరెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

బద్వేల్ : కలసపాడు అమ్మవారి శాలలో భవానీ మాతను బద్వేల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్, సంఘం సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాలఅంకిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, నారాయణ, రామసుబ్బారెడ్డి, సత్యనారాయణ, నారాయణ, గన్రైనారాయణ, క్రిష్టయ్య పాల్గొన్నారు.

## ఖాదర్‌హుస్సేన్ మసీదు వద్ద ఉద్రిక్తత

- మసీదు వద్ద బైఠాయించిన అంజుమన్ ప్రెసిడెంట్ వీఎస్ ముక్తియార్, సభ్యులు
- అంజుమన్ నుంచి వైదొలిగాం
- ఖాదర్‌హుస్సేన్ మసీదుపై అంజుమన్ పెత్తనం అక్కర్లేదంటున్న కమిటీ సభ్యులు


ఖాదర్‌హుస్సేన్ మసీదు ముందు బైఠాయించిన అంజుమన్ ప్రెసిడెంట్ వీఎస్ ముక్తియార్, తదితరులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ప్రశాతంగా ఉండే ఖాదర్‌హుస్సేన్ మసీదు వీధిలో ఒక్క సారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ నాయకుడు, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ వీఎస్ ముక్తియార్ తన అనుచర గణంతో ఖాదర్‌హుస్సేన్ మసీదు ముందు బైఠాయించారు. ఖాదర్‌హుస్సేన్ మసీదు నిర్వహణలో అవకతవకలు జరిగాయని, లెక్కా జమలు చూపడం లేదని స్థానికులు ఫిర్యాదు చేస్తే మాట్లాడేందుకు వచ్చామని, అయితే ఇంతలోనే కమిటీ సభ్యులు మసీదుకు తాళాలు వేసి వెళ్లారని వీఎస్ ముక్తియార్‌తో పాటు అక్కడున్న పలువురు తెలిపారు. మసీదు ముందు నినాదాలు చేయడంతో పాటు అక్కడున్న వారు పెద్ద ఎత్తున కేకలు వేయడంతో స్థానికులు ఒకింత విస్మయానికి గురయ్యారు. తర్వాత వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని ఇక్కడ ఎలాంటి ఆందోళన చేయరాదని, 2వ తేది తర్వాత మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ముక్తియార్, ఆయన వర్గీయులను అక్కడి నుంచి వెళ్లిపోయారు.

**ఖాదర్‌హుస్సేన్ మసీదుపై అంజుమన్ పెత్తనం ఎందుకు ?**

ఐదు నెలల క్రితమే అంజుమన్ నుంచి వైదొలిగాం.. అంజుమన్ నుంచి జీతాలు కూడా తీసుకోలేదు.. అలాంటప్పుడు ఖాదర్‌హుస్సేన్ మసీదుపై అంజుమన్ కమిటి పెత్తనం ఎందుకని మసీదు కమిటీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఐదు నెలల క్రితం జరిగిన అంజుమన్ కమిటి ఎన్నికల్లో ఖాదర్‌హుస్సేన్ మసీదు నుంచి ముతవల్లి, కమిటీ సభ్యుల అంగీకారం లేకుండానే ఫోర్జరీ సంతకాలు చేసి ఇరువురిని అంజుమన్ కమిటీలో సభ్యులుగా నియమించారు. ఖాదర్‌హుస్సేన్ మసీదు నుంచి తాము ఎవరినీ సభ్యులుగా ఎంపిక చేయలేదని ముతవల్లి అజ్మతుల్లా ప్రకటన కూడా ఇచ్చారు. మిలాదున్నబి పండుగ సందర్భంగా ఖాదర్‌హుస్సేన్ మసీదు నుంచి ఆషారే షరీఫ్ దర్గాకు ప్రతి ఏడాది గంధం తీసుకెళ్తారు. ఇలా సుమారు 100 ఏళ్ల నుంచి గంధం తీసుకెళ్లే సాంప్రదాయం నడుస్తోంది. ఇటీవల జరిగిన మిలాదున్నబి పండుగ సందర్భంగా ఖాదర్‌హుస్సేన్ మసీదు నుంచి ఆషారే షరీఫ్ దర్గాకు గంధం తీసుకొని రావద్దని అంజుమన్ కమిటి నుంచి లెటర్ పంపిచారు. మసీదు నుంచి తీసుకెళ్లాల్సిన గంధాన్ని అదే వీధిలోని ఒక వ్యక్తి ఇంటి నుంచి తీసుకెళ్లారు. మసీదు కమిటి సభ్యులు మాత్రం ప్రతి ఏడాది లాగే గంధం చాందినీని వీధుల్లో ఊరేగించి తిరిగి మసీదులో పెట్టారు. గంధం తీసుకురావద్దని చెప్పడంతో అంజుమన్ కమిటి నుంచి వైదొలుగుతున్నట్లు ఖాదర్‌హుస్సేన్ మసీదు కమిటి సభ్యులు, ముతవల్లి ప్రకటించారు. ఐదు నెలలుగా అంజుమన్ కమిటి నుంచి జీతాలు కూడా తీసుకోలేదని మసీదు కమిటి సభ్యులు తెలిపారు.

**మసీదు నిర్వహణ బాధ్యత మేము చూసుకుంటాం**

ఖాదర్‌హుస్సేన్ మసీదు అభివృద్ధి, నిర్వహణ బాధ్యతలన్నీ కమిటీ చూసుకుంటుందని, ఇందులో అంజుమన్ కమిటి జోక్యం అవసరం లేదని కమిటీ సభ్యులు చెబుతున్నారు. ఖాదర్‌హుస్సేన్ మసీదుకు కావాలని తాళాలు వేయలేదని వారు తెలిపారు. ప్రతి రోజు నమాజు పూర్తి అయిన కొంత సేపటి తర్వాత మసీదుకు తాళం వేస్తామని, అలాగే నమాజుకు 30–45 నిమిషాల ముందు తిరిగి తీస్తామని చెప్పారు. ఖాదర్‌హుస్సేన్ మసీదు వీధి ప్రజల సలహా, సూచనల మేరకు కమిటి అన్ని విధాలుగా ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. మసీదు నిర్వహణ, లెక్కా జమల్లో ఎలాంటి లోపాలు లేవని, అన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. కాగా మసీదులో మీటింగ్ పెట్టుకోవాలంటే తమను అడగాలని ముతవల్లి అజ్మతుల్లా తెలిపారు. మసీదు కమిటి బాధ్యతగా పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు.









## అధికార దర్పం

- వైఎస్సార్‌సీపీ ఎంపీపీపై టీడీపీ సర్పంచ్ చిందులు
- మండల సమావేశంలో ఎమ్మెల్యే ముందే ఎంపీపీపై వ్యక్తిగత దూషణలకు దిగిన సర్పంచ్


ఎంపీపీ శేఖర్ యాదవ్‌పై చిందులేస్తున్న సర్పంచ్ శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీకి చెందిన కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అధికార దర్పం ప్రదర్శించారు. సర్పంచ్ స్థాయిని మరచి మండల పరిషత్ అధ్యక్షుడు సానబోయిన శేఖర్ యాదవ్‌పై వ్యక్తిగత దూషణలకు దిగి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, పాలక పక్షం సమక్షంలోనే చిందులేశారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీలో విశాలమైన మురికి కాలువల నిర్మాణం చేపట్టినప్పటికీ ప్రొద్దుటూరు రామేశ్వరం మొదలుకుని ప్రభుత్వాస్పత్రి నుండి సినీ హబ్ వైపు, రిలయన్స్ పెట్రోలు బంకు వైపు వర్షం నీరు, మురికి నీరు ఎక్కువగా వచ్చి ఎక్కడ చూసినా నీరు పారేందుకు వీలు లేకుండా ఉందని సర్పంచ్ శివచంద్రారెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. అందుకు ఎంపీపీ స్పందిస్తూ కొత్తపల్లె గ్రామ పంచాయతీలో నిర్మించే మురికి కాలువల నీరు వెళ్లేందుకు ఔట్‌లెట్ లేకుండా నిర్మించడం, ప్రణాళికబద్ధత లేకపోవడంతో ప్రజలకు మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందన్నారు. దీనిపై సర్పంచ్ ఎంపీపీపైనే విరుచుకుపడ్డాడు. 'నీకు రాజకీయం ఏమి తెలుసు, చేతకాని వాళ్లంతా రాజకీయం చేస్తున్నారు.. నీరు మూసుకో మళ్లీ మాట్లాడుతున్నావా' అంటూ సమావేశానికి అధ్యక్షత వహిస్తున్న ఎంపీపీపైనే సర్పంచ్ చిందులేయడంతో అక్కడున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీపై ఒక సర్పంచ్ ఇలా నోరు పారేసుకోవడం ఏమిటని అభిప్రాయపడ్డారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్‌కు ప్రజలు, వ్యాపారులు కప్పం చెల్లిస్తే ఒక రకం, చెల్లించకపోయినా, కక్షలు ఉన్నా మరొక రకం పరిపాలన కొనసాగిస్తున్నాడని ఎంపీపీ విమర్శించారు.

**అధికారులపై ఎమ్మెల్యే అసంతృప్తి**

సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సమావేశంలో సభ్యులు సభ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరింకపోతే సమావేశాలెందుకు, అధికారులు ఎందుకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆక్రమణకు గురైన శ్మశానాలపై సర్వే చేసి వాటిని అభివృద్ధి చేయాలని ప్రతి సమావేశంలో చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే.. తహసీల్దార్ గంగయ్యను ప్రశ్నించారు. యూరియా కొరత లేకుండా చూడాలన్నారు.



# రైతుల జీవన ప్రమాణాలు పెంచేదిగా ప్రభుత్వ నిర్ణయం

మైదుకూరు : జీఎస్టీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం రైతుల జీవన ప్రమాణాల ఆదాయాన్ని పెంచే విధంగా ఉందని మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులు, పనిముట్లపై గతంలో ఉన్న 13 శాతం జీఎస్టీ నుంచి ప్రస్తుతం 5 శాతానికి తగ్గించడం తజరిగిందన్నారు. జీఎస్టీ డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ ఎస్. చంద్రానాయక్ మాట్లాడుతూ తగ్గించిన జీఎస్టీ ప్రకారం రైతులకు లబ్ధి చేకూరే వివిధ రకాల సమాచారాన్ని క్లుప్తంగా రైతులకు వివరించారు.

**జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లాభం**

**పోరుమామిళ్ల :** వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసేవారికి 13 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించినట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ సీఎం బాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అధికారులు, అనుబంధ రంగాల రైతులతో జరిగిన సమావేశంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు.

**ప్రొద్దుటూరు రూరల్ :** వ్యవసాయ ఉత్పత్తులు, పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గించడంపై మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి హాజరయ్యారు.

## విద్యార్థులకు పద్యాల పోటీలు

పోరుమామిళ్ల : పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం పద్యాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న వారికి విశ్రాంత ఉపాధ్యాయుడు ఆలమూరి వెంకటస్వామి పెన్నులు, స్వీట్స్ పంపిణీ చేశారు. గ్రంథాలయానికి గడియారం వితరణ చేశారు.

## విజయ దశమి శుభాకాంక్షలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

అట్లూరు : బద్వేల్ నియోజకవర్గ ప్రజలకు, నాయకులు, కార్యకర్తలు, అధికారులకు ఎమ్మెల్సీ డీసీ.గోవింద రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు, రైతులకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరికీ జగన్మాత మేలుచేకూర్చాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.